

# మొదటి పేషెంట్

ఉదయం పదకొండు గంటలకి కారు వచ్చి గవర్నమెంట్ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఆగింది. కారు దిగి, లాక్‌చేసి లోపలకి నడిచాను నేను.

నర్స్‌లు, కాంపౌండర్‌లు, రోగులు, యితర డాక్టర్లు అనేకమంది విష్ చేసారు నన్ను. చిరునవ్వు వాళ్ళకి సమాధానంగా ఇచ్చి లోపలకి నడిచాను.

“హలో డాక్టర్ విష్ యు గుడ్ లక్” అన్నాడు ఓ స్నేహితుడు నాకు ఎదురుబడి.

నేను సూపరింటెండెంట్ గదిలోకి వెళ్ళేసరికి చాలామంది కూర్చుని వున్నారు. దాదాపు ఇరవైమందిదాకా వున్నారు. కొంతమంది ప్రెస్‌రిపోర్టర్లు. కొంతమంది ఆహ్వానించగా వచ్చిన బయటి డాక్టర్లు, కొంతమంది అభినందనలు తెలియచేయడానికి వచ్చిన పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు.

నా కోసం ప్రత్యేకింపబడిన కుర్చీలో కూర్చున్నాను నేను.

కొన్ని నిముషాల తర్వాత గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ లేచి నిలబడ్డాడు, కొన్ని క్షణాల్లోనే సద్దుమణిగింది. ప్రెస్ రిపోర్టర్స్ తమ షార్ట్‌హేండ్ పుస్తకాలతో, పెన్సిళ్ళతో సిద్ధంగావున్నారు. ఆయన చెప్పేది వ్రాసుకోడానికి.

గదిలోని అందరినీ వుద్దేశించి చెప్పాడు హాస్పిటల్ ప్రధానాధికారి. సూపరింటెండెంట్. తూచితూచి నెమ్మదిగా మాట్లాడే ఆయన స్వభావం విలేఖరులకి లాభించిందనే చెప్పాలి, అక్షరం పొల్లుపోకుండా వ్రాసు కోడానికి.

"మన మిత్రుడు, ఈ హాస్పిటల్‌లో పనిచేసే సివిల్ సర్జన్, వారం రోజులక్రితం కెనడానుంచి తిరిగి వచ్చారన్న సంగతి మీకు తెలుసు. కెనడాలో వున్నంతకాలం శాయశక్తులా శ్రమపడి, వైద్యరంగానికే గర్వింప తగ్గ ఓ క్రొత్త ఆపరేషన్ విధానం నేర్చుకుని వచ్చారు."

సూపరింటెండెంట్ ఓసారి ఆగి, నా వంకచూసి చిరునవ్వు నవ్వి మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఇతర దేశాల్లో, ముఖ్యంగా వెస్ట్రన్ కంట్రీస్‌లో, వైద్యరంగం ఎంతో పురోగమించింది. మనిషిని బ్రతికించడానికి అనేక కొత్తపరికరాలు కనుక్కొంటున్నారు. శస్త్ర చికిత్సలో ఎంతో ముందంజవేసారు.అందులో 'హార్ట్ ట్రాన్స్‌ప్లాన్ టేషన్' అతి ముఖ్యమైంది." ఓసారి అందరివంకా చూసి మళ్ళీ ప్రారంభించాడు గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్.

"మీకు తెలుసు. పేపర్లలో చదివే వుంటారు. 'హార్ట్‌ట్రాన్స్‌ప్లాన్ టేషన్' గొప్ప టెక్నిక్, ఒకమనిషి హృదయాన్ని తెరచి, గుండెని బయటకితీసి, మరొకరికి అమర్చి మళ్ళీ మూసెయ్యటం ఎంత అద్భుతం?

దేముడు ప్రసాదించిన తన గుండెతో కాక మరొకవ్యక్తి గుండెతో జీవించడం నిజంగా భగవంతుడికి, అసలు భగవంతుడంటూ వుంటే ఆ భగవంతుడికి మన శక్తిని ప్రదర్శించటమే కదా!

మీరు సైన్స్ చదివేటప్పుడు, చిన్నప్పుడు నేర్చుకునే వుంటారు. గుండె అతిసున్నితమైన భాగమనీ, మీ కుడిచేతి గుప్పిటంత వుండే చిన్న భాగమని, ఆ గుండెని తీసి మరొకరి గుండె అమర్చే 'నోహౌ'— విధానం అభ్యసించి వచ్చినడాక్టర్ మన ఆంధ్రప్రదేశం గర్వింపతగ్గవ్యక్తి.

అగి. ఓసారి మళ్ళీ నావంకచూసి నవ్వి మొదలుపెట్టాడు సూపరిం టెండెంట్. కొంతమంది నావంక చూసారు కూడా.

భారతదేశంలో ఈవిద్య నభ్యసించినవాళ్ళు బహుకొద్దిమంది. వేళ్ళ మీద లెక్కించవచ్చు. తెలుగు వాళ్ళలో ఈ డాక్టర్ ఒక్కడే. ఈ దేశం వచ్చిన వారం రోజుల్లోనే, ఇక్కడే, ఈ యువకుడు తను నేర్చుకున్నది వుపయోగించే అవకాశం రావటం ముదావహం"

ఓసారి చేతి గడియారం వంక చూసుకుని పూర్తిచేసాడు సూపరిం టెండెంట్.

"సరిగ్గా మూడుగంటలకి ఆపరేషన్ మొదలవుతుంది. ఈ యువ కుణ్ణి, ఈ సందర్భంలో మీకు పరిచయం చేయటం నా ధర్మంగా భావించి మిమ్మల్ని ఆహ్వానించాను"

ఐ. జి. ఆఫ్ పోలీస్ లేచి నిలబడి నాతో అన్నారు.

"మా శాఖ ముందుగా మీ సహాయం వినియోగించుకోవటం మా అదృష్టంగా భావిస్తున్నాను. మీరుకూడా ఏదైనా మాట్లాడితే బావుంటుంది"

"అవును, మాట్లాడండి. మాట్లాడమని మేముకూడా అడగాలను కుంటున్నాము."అన్నాడు ఓ విలేకరి.

లేచి నిలబడ్డాను నేను, ఐ. జి. కూర్చోగానే, ఓసారి టైనాట్ సర్దుకుని చెప్పసాగాను.

"చెప్పేది కాస్త క్లుప్తంగా చెప్పి ముగిస్తాను. రెండు సంవత్సరాల క్రితం కెనడా వెళ్ళాను.హార్ట్ట్రాన్స్ప్లాన్టేషన్ నేర్చుకున్నాను. కొంచెం కష్టమైనా ఆపరేషనే ఐనా, బ్రహ్మవిద్యేమీ కాదు. ఆ ఆపరేషన్ విజయం అవడానికి తోడ్పడేవి అపార్టస్. అనేక వైద్య సదుపాయాలు. సాంకేతి కంగా వున్నత స్థాయితో చెప్పుకోతగ్గ అపార్టస్ మన దగ్గర లేకపోయినా వున్నదాంతోనే ప్రయత్నిస్తాను. మన ప్రభుత్వం వెంటనే వాటిదిగుమతికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా నేను కోరుకుంటున్నాను.

"అంజనేయులు నా మొదటి భారతీయ పేషెంట్. నక్సలైట్.

అతను శ్రీకాకుళం అడవుల్లో నాలుగు సంవత్సరాలనుంచి వుంటూ, విప్లవం లేవదీయాలని ప్రయత్నిస్తున్నాడని చెప్పారు ఐ జి నాకు.కమ్యూనిస్టు సిద్ధాంతాలని నమ్మి. అనేకమంది ధనవంతుల ధన, ప్రాణాలని అపహరించిన నేరస్థుడు అంజనేయులు"

కొన్ని క్షణాలదాకా మౌనంగా వుండిపోయాను. తర్వాత మళ్ళీ చెప్పసాగాను.

"నిన్న పోలీసులు. నక్సలైట్స్ మధ్య జరిగిన కాల్పులలో దొరికాడు అంజనేయులు. ఇక్కడ జైల్‌కి బదిలీ చేయబడ్డాడు. గుండెల్లో ఓ గుండు గుచ్చుకుంది అంజనేయులుకి. నిన్నరాత్రి హాస్పిటల్‌కి తీసుకువస్తే చూసాను మిగతా రోగులతోపాటు.

గుండెమార్పిడి చేస్తే అంజనేయులు బ్రతికే అవకాశం వుందని గ్రహించి ఆ సంగతి తెలియచేసాను సూపరింటెండెట్‌కి ఫలితంగా ఈ ఆపరేషన్ చేస్తున్నాను."

రిపోర్టర్స్ వ్రాసుకుంటున్నారు తలవంచుకుని.

"నాకర్థమైనదేమిటంటే, అంజనేయులు తప్పక బ్రతకాలి. బ్రతికితే అతనినుంచి అనేక విషయాలు పోలీసులు రాబట్టగలుగుతారు. అనేకమందిని ఏడిపించిన రాక్షసుడు అంజనేయులు. అతన్ని నా మొదటి పేషేంటుగా అంగీకరించాను. నా ప్రయత్నం నేను చేస్తాను. ఆ పైన దేవుడి దయ" అని చిన్నగా నవ్వి అన్నాడు. "అసలు ఆయుష్షువుండాలి గదా."

కూర్చున్నాను నేను, ఇక చెప్పేదేమీ లేదన్నట్లుగా. కొంతమంది విలేఖరులు ఐ. జి.ని గబగబా చాలా ప్రశ్నలు వేసారు అంజనేయులు గురించి.

ఐ. జి. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా క్లుప్తంగా కేస్ వివరాలు చెప్పారు, అన్ని ప్రశ్నలని కవర్‌చేస్తూ. ఐ. జి. చెప్పేదంతా నాకు అంతకు ముందురోజే తెలిసింది ఆయన ద్వారానే. అందుకని శ్రద్ధగా వినలేదు నేను.

"ఆంజనేయులు బాగా చదివినవాడు. యం. యస్. సీ ప్యాసై పి. హెచ్. డి. చేస్తూ, నక్సలైట్లతో చేరాడు. మధ్యలో చదువు మానేసి. చిన్నప్పటినుంచీ రాజకీయాలంటే ఆంజనేయులికి ఇష్టమే. కాలేజీలో వుండగా మావో పుస్తకాలు మొదలయిన కమ్యూనిస్టు సాహిత్యం విరివిగా చదివాడు.

శ్రీకాకుళంలోని నక్సలైట్లలో చాలామంది విద్యాధికులే. ఓ.యం. పి. కుమార్తెకూడా వుందంటే మీకు ఆశ్చర్యం వేయచ్చు. వాళ్ళంతాకలసి ఈమధ్య పార్వతీపురం ప్రాంతాలలో వున్న పల్లెటూర్ల మీద పడి, కామందులని, వున్నవాళ్ళని హత్యలు, మానభంగాలుచేసి దోచుకుంటున్నారు.

ఆంజనేయులు అందరికీ నాయకుడు.

రిజర్వ్ పోలీస్‌ని పంపింది ప్రభుత్వం నక్సలైట్లకీ, వాళ్ళకీ జరిగిన కాల్పులలో ఆంజనేయులు దొరికారు అదృష్టవశాత్తు."

మరో ఐదు నిముషాల తర్వాత ఆ చిన్న సమావేశం ముగిసింది. రిపోర్టర్స్ వెళ్ళిపోయారు.

ఐ.జి. వెళ్ళిపోతూ నాతో చెప్పడానికి వచ్చాడు.

"ఇందాక నక్సలైట్ల గురించి చెపుతున్నారు. నక్సలైట్లు ఎవరు? ఎంతకాలంనుంచి యిలా జరుగుతోంది?"అడిగాను నేను ఐ.జి.ని.

"మీరు ఈమధ్య మనదేశంలో లేకపోవడంవల్ల వీళ్ళగురించి మీకు తెలియకపోయి వుండవచ్చు, విప్లవకారులు కొందరిని "నక్సలైట్" అంటున్నారు బెంగాల్, కేరళలో ఎక్కువమంది వున్నారు. మన ఆంధ్ర ప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లాలో వున్న పర్వతశ్రేణుల్లో వున్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు వాళ్ళని ధనవంతులని దోచి, పేదలకు పంచటం వాళ్ళ ఆశయం."

వాళ్ళకి అంతబలం ఎలా వచ్చింది?"

"అక్కడ కొండజాతివాళ్ళు చాలామంది వున్నారు. అడవుల్లోని

పుట్టతేనె, యలక్కాయలు, చీపుర్లు, లక్క వగైరా తీసుకువచ్చి చుట్టు ప్రక్కల గ్రామాలలో అమ్మటంవల్ల వాళ్ళ జీవనం గడుస్తుంది.

కొంతమంది వ్యాపారులు వాళ్ళ దగ్గర ఆటవస్తువులు అతిచౌకగా కొని, ఎక్కువ లాభాలకు బయట అమ్మటం రివాజు అక్కడ. చాలా మంది ఆ కొండజాతివాళ్ళకి జరిగే మోసం తెలియచెప్పి, వాళ్ళకళ్ళు తెరి పించి. మావో సిద్ధాంతాలు బోధించి, నక్సలైట్లుగా మార్చారు.

ఆ విద్యావంతుల సహకారంతో ఆ అడవిజాతివాళ్ళు తమ విల్లం బులు, కత్తులు, కటారులతో ఆ ధనవంతుల ఇళ్ళమీదపడి దోచుకోవడం మామూలయిపోయింది వీళ్ళ దురాగతాలను ఆపడానికి ప్రభుత్వం జోక్యం కలుగచేసుకోవలసి వచ్చింది. స్థానబలిమి బాగావుందివాళ్ళకి. క్రమక్రమంగా వాళ్ళని అరెస్టు చేస్తున్నారు."

చిన్నగా నవ్వి అన్నాను నేను.

"థాంక్స్. చాలా వివరంగా చెప్పారు"

"అంజనేయులు చేసిన ఓ పది హత్యలకి సాక్ష్యం లభించింది మాకు. అంజనేయులు బ్రతికితే వాళ్ళ గురించిన రహస్యాలు అనేకం తెలుసుకోవచ్చు"

"ఐ విల్ డు మై లెవెల్ బెస్ట్"

ఆ రోజు మధ్యాహ్నం మూడుగంటలకి ఆపరేషన్. నేను నెమ్మ దిగా తయారవసాగాను ఆపరేషన్ చెయ్యడానికి. ఆపరేషన్ గదిలో పరిక రాలన్నీ సరిగ్గా అమర్చారో, లేదో తనిఖీచేశాను.

ఆక్సిజన్, అపార్టస్, ఎనెస్థిషియా పరికరాలు, రక్తం ఎక్కించే పరికరం, బ్లడ్‌ప్రెషర్ చెక్‌చేసే పరికరం, కార్డియోగ్రాం, ఆపరేషన్‌కి వుపయోగించే సర్జికల్స్ ఇంకా అనేకం స్వయంగా చెక్‌చేశాను.

నాకు సహాయంగా వుండే మరో అయిదుగురు డాక్టర్‌లకు, నర్సు లకు చెప్పాను ఆపరేషన్ విధానం క్లుప్తగా. ఏ టైంకి ఏం చేయాలో మొదలయిన విషయాలన్నీ బ్రీఫ్ చేశాను.

సరిగ్గానే వుందని తృప్తిపడ్డాను అంతా చూశాక. మూడు గంట లకి ప్రారంభించవచ్చు. ఓ ఖాళీ ఈజీచెయిర్‌లో కూలబడి కళ్ళు మూసు కున్నాను. తలంతా భారంగా వున్నట్లుగా అనిపించింది.

కళ్ళముందు ఓ దృశ్యం. నాకెంతో ఇష్టమైన దృశ్యం అది పొగ మంచు. గాజు తలుపులున్న గదిలో నేను, నా ప్రక్క ఫ్లాట్‌లోని టీనే జర్. మంచులా తెల్లగావున్న గౌను ఒంటికి అతుక్కుపోయినట్లు బిగు తుగావుంది; ఆ విధంగా వుండడంవల్ల వంటివంపులు ప్రస్ఫుటమవు తున్నాయి?

ఆ రోజు... ఆ రాత్రి మొదటిసారిగా నా జీవితంలో స్త్రీసుఖం చవి చూశాను. భారతదేశంలో పరాయిస్త్రీవంక కన్నెత్తికూడా చూడారని చెబితే నమ్మరు కెనడాలో.

క్రాష్ టైర్లు కీచుమన్న శబ్దం. చిన్నకేక. అంతా నెత్తురు. తెల్లని మంచుదుప్పటిమీద ఎర్రటి చిక్కటి రక్తం ఇంకిపోతోంది.

నా కళ్ళముందే ఆ టీనేజర్ కారు ఏక్సిడెంట్‌లో చచ్చిపోయింది నన్ను మృత్యువునుంచితప్పించి మర్నాడు.

తల విదిలించాను కళ్ళు తెరచి ఎప్పుడు వంటరిగా వున్నా, ఎప్పుడు చావు గురించి ఆలోచించినా. ఎప్పుడు చచ్చిపోయిన మా నాన్న గుర్తు వచ్చినా, ఆ ఏక్సిడెంట్ కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది.

ఎంత ప్రయత్నించినా ఆ దృశ్యం నా బుర్రలోంచి బయటకి వెళ్ళటంలేదు. పీఠం వేసుకుని కూర్చుంది. బహుశా అదే మొదటిసారను కుంటాను నేను చావుని చూడటం. అంతదాకా చావు సంభవించలేదు నా చుట్టుపక్కల ఎవరికీ.

నాన్న గుర్తుకువచ్చారు నాకు మళ్ళీ.

"అబ్బాయ్ జాగ్రత్తగా చదువు. పెద్దయితే నిన్ను డాక్టర్ చది విస్తాను" అనేవాడు నా చిన్నతనంలో.

"అప్పుడు అందరికీ మందులిస్తాను" అనేవాడిని నేను సంతోష పడిపోతూ.

"అవును. ఇంజక్షన్లుకూడా ఇవ్వచ్చు"

"నిజంగా నన్ను డాక్టర్‌ని చదివిస్తావా నాన్నా?"

"నువ్వు మరి జాగ్రత్తగా చదువుకుంటేనే ఏదీ? ఈ పాఠం ఇవాళ చదివి అప్పచెప్పగలవో లేదో చూద్దాం"

బాధగా నవ్వుకున్నాను. నాన్న ఇప్పుడు లేరు. కాని నాన్న నాటిన బీజంవుంది నాలో పెరిగింది. ఇంకా పెరుగుతోంది. డాక్టర్ కోర్సు చదవాలనే ఆసక్తి కలగజేసింది నాన్నే నాలో. చిన్నప్పటినుంచీ, నాతోపాటు కూర్చుని తెల్లారేదాకా నాచేత చదివించిన నాన్నే కారణం నా అభివృద్ధికి.

అందుకే నాకు నాన్నంటే ప్రాణం. చాలామంది నాన్నకన్నా అమ్మంటేనే ఇష్టం. నా ప్రయత్నాలకి తోడ్పడి నన్ను ఓ ఉత్తమవ్యక్తిగా తీర్చిదిద్దిన వ్యక్తి నాన్న.

కాని మరణించే సమయంలో నాన్న దగ్గర వుండలేకపోయాను. నాన్న తలకి కొరివి పెట్టలేకపోయాను. నాన్నని ఏ విధంగా ఆదుకోలేకపోయాను. నాన్న మరణించిన వారందాకా చచ్చిపోయిన సంగతి నాకు తెలియనే తెలియదు.

ఒంటరిగా వున్నప్పుడు చావులగురించి ఆలోచించటం అలవాటయింది. ఆ ఆప్తుల చావులు నా మనసుకి రంపపుకోత పెడతాయి ఒక్కోసారి నిద్ర పట్టదు.

చివరి క్షణాల్లో నాన్న దగ్గిర చెల్లాయ్ దగ్గిరవుంటేనన్నా కొంత మనశ్శాంతి దొరికేదేమో నాకు?

"డాక్టర్."

ఎవరిదో పిలుపు విని కళ్ళు తెరచి చూశాను.

"నిద్రపోతున్నారా?"

నర్స్ నవ్వుతూ అడిగింది నన్ను.

"లేదు" నవ్వాను నేనుకూడా.

"పేషంట్‌ని ఆపరేషన్ థియేటర్‌కి చేర్చమా?" అడిగింది నర్స్ నన్ను.

చేతిగడియారం వంక చూసుకున్నాను. దానివంక చూసుకుంటే మళ్ళీ నాన్న గుర్తుకు వచ్చారు. నేను పి.యు.సి. ఫస్ట్‌క్లాసులో ప్యాసయిన రోజు నాన్న ఇచ్చిన కానుక అది.

రెండున్నర అయింది.

"చేర్చండి" కొన్ని సూచనలు ఇచ్చి పంపేశాను నర్స్‌ని.

కాఫీ కావాలనిపించింది ఈ ఆలోచనలుపడ్డ నా మనసు తేలిక పడితేగాని సరిగ్గా పనిచేయదు. ఎంతో జాగ్రత్తగా, మెళకువగా చేయాల్సిన పని అది.

వాషింగ్‌బేసిన్ దగ్గరకెళ్ళి, చన్నీటితో చేతులు, మొహం కడుక్కొని, పాకెట్ కోంబ్‌తో తల దువ్వుకున్నాను, నాకు పరిచయంవున్న ఓ డాక్టర్ గదిలోకి వెళ్ళాను.

"హలో. రెడీ?" అడిగాడు.

"రెడీనా మీరు?"

తలూపాడు.

"మీ ఫ్లాస్క్‌లో కాఫీ వుందా?" అడిగాను.

కావల్సినంత" నవ్వి గాజుగ్లాసులోకి కాఫీవంచి అందించాడు నాకు. కాఫీ తాగాక బయల్దేరాం ఇద్దరం. నడుస్తూ మాట్లాడసాగాను నేను.

"ఇది ఎంతో జాగ్రత్తగా చేయాల్సిన ఆపరేషన్. ఆపరేట్‌చేసి పేషెంట్ గుండె తీయాలి బయటికి. అదేసమయంలో మరొకరి గుండెతీసి సిద్ధంగావుంచి మార్పిడి చెయ్యాలి. టైం ఎలిమెంట్ ముఖ్యం అన్నిటికన్నా"

ఆపరేషన్ థియేటర్ చేరాం. నేను చేతులు మరోసారి శుభ్రంగా

వేడినీళ్ళతో కడుక్కుని, దాదాపుగా నా ఒంటిరంగేవున్న పచ్చటి రబ్బర్ గ్లవ్స్ తొడుక్కున్నాను. అప్పటికే అంతా సిద్ధం అయ్యారు.

ఆంజనేయులువైపు నడిచాను. నావంక చూశాడు. బలహీనంగా వున్నాడు రక్తం చాలా కారిపోవటంవల్ల నవ్వాడు నావంక చూసి. కళ్ళలో కాంతిలేదు. నవ్వులో వుత్సాహంలేదు.

కొన్నిక్షణాలు రెప్పవేయకుండా చూసాను ఆంజనేయులువంక. నా నిశితమైన చూపులకి తట్టుకోలేక కళ్ళు తిప్పుకున్నాడు ఆంజనేయులు.

"కోపంగా వున్నారే?" అడిగాడు.

నవ్వొచ్చింది నాకు. అంత నిశితంగా చూడటం సభ్యత కాదనిపించింది. ఆంజనేయులు భుజంమీద తట్టాను ధైర్యంగా ఉండమన్నట్లుగా.

చిన్నగా మూలుగుతున్నాడు. నడుంనుంచితలదాకా నగ్నంగావుంది ఛాతీకి కుడివైపు బాండెజ్ కట్టివుంది. మత్తుమందు ఇచ్చారు ఆంజనేయులుకి. కొన్ని నిముషాల్లోనే మరో నాలుగు గంటలదాకా కళ్ళు విప్పనంత మత్తుమందు పీల్చాడు ఆంజనేయులు.

లైట్లు వెలిగాయి ఆపరేషన్ టేబిల్‌మీద. ప్రక్కనేవున్న మరో టేబిల్‌మీదవున్న శవంవంక చూసాను. నిర్భాగ్యుడెవరో రోడ్ ఏక్సిడెంట్‌లో చచ్చాడు. గుండె చెక్కుచెదరలేదు. చచ్చిపోయిన తర్వాత తన గుండె మరొకరికి ఉపయోగిస్తుందని ఎప్పుడూ భావించి ఉండడు.

అతని గుండెని ఆపరేట్ చేస్తున్నారు డాక్టర్లు కొంతమంది. అతని బ్లడ్‌గ్రూప్ వగైరాలు అంతకుముందే చెక్‌చేశాను.

నా చేతులు చకచకా వాటిపని అవి చేసుకుంటున్నాయి. అక్కరలేని సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్ ట్రేలోపెట్టి కావల్సినది అడుగుతున్నాను. క్షణాలలో నా చేతుల్లోకి వస్తోంది నాక్కావాల్సినది.

నా ప్రక్కనే వుండి నాకు సహాయం చేస్తున్న ఇద్దరు కార్డియాలజిస్ట్స్ నా చేతుల్ని చేతలని శ్రద్ధగా గమనిస్తున్నారు.

చర్మం. దానికింద రక్తనాళాలు. ఆకింద నరాలు ఆకింద పెట్టె లాగవున్న ఎముకలు గుండె.

వూపిరి బిగబట్టి నాపని నేను చేస్తున్నాను. మధ్యమధ్యలో బ్లడ్ ప్రషర్, కార్డియోగ్రాం, బ్లడ్‌సప్లయ్, ఆక్సిజన్ చూస్తున్నాను అంతాసరిగా ఉందో లేదోనని.

"ఎర్రటి రక్తం.

గుండెకాయ.

గుండెకాయ కనపడుతోంది నాకు.

గుండెని వేరుచేసి బయటకి తీశాను ధమనులు, శిరలని కట్‌చేసి. బుల్లెట్ తీసి సిద్ధంగా ఉంచిన ట్రేలో ఉంచాను ఆ రెంటినీ. పోలీస్‌కాల్చిన బుల్లెట్ అది.

అసలుపని, ముఖ్యమయిన, అతిక్లిష్టమయిన పని అప్పుడే మొదలవుతుంది.

ఆ అభాగ్యుడి గుండె ఆ ఖాళీస్థానంలో వుంచి పనిచేసేలాచేసి, మళ్ళీ కుట్టేయాలి ఎప్పటి మాదిరిలా, శిరలు, ధమనులూ, రక్తనాళాలు, నరాలు కలిపేసి. ప్రకృతి ఎలా సృష్టించినదో ఆవిధంగానేవుండాలి లోపల పూర్తిగా. వెంట్రుకవాసంత పొరపాటు జరిగినా ఆపరేషన్ విజయవంతం కాదు. అంజనేయులు జీవితం అంతం అవుతుంది.

చమటలు పడుతున్నాయి నాకు.

నాన్న గుర్తుకు వస్తున్నాడు. నాన్న గుండె గుర్తుకు వస్తోంది. అంతేకాదు, చెల్లాయ్ గుండెకూడా.

మరో గుండె.

కెనడాలోని నా స్నేహితురాలి గుండె.

"ఐ లవ్ యు స్వీట్ హార్టు ఐ లవ్ యు ఐ నీడ్ యు"

"అన్నాయ్. గుండె మన గుప్పెటంత వుంటుందిట నిజమేనా?"

"వాడు గుండెకాయ అప్పయినాసరే వాడు కెనడా వెళ్ళాల్సిందే పై చదువులకి—"

"గుండె కొట్టుకుంటోంది సార్" నర్సు చెప్పింది ఆనందంగా.
కార్డియోగ్రాంవంక చూశాను తృప్తిగా నిట్టూర్చాను నేను.
ముఖ్యమయిన భాగం అయిపోయింది జయప్రదంగానే.
"వాట్ నెక్ట్స్?"అడిగాడు నా ప్రక్కనున్నతను.

సమాధానం చెప్పలేదు నేను. సిద్ధంగా ఓ ప్రక్కనే వుంచిన మిల్లీ మీటర్‌సైజులో వున్న చిన్న టేబ్లెట్-గొట్టం గుండె ప్రాంతంలో ఓచోట వుంచాను.

జయప్రదంగానే జరిగింది అంతా! భయపడ్డాను ముందర ఒక్కడీన్నీ చేయగలనా, లేదానని. మూసేసి పైనకుట్లు వేయడానికి చాలా సేపుపట్టింది బేండేజ్ కట్టింది నర్సు ఆంజనేయులు ఛాతీమీద.

ముక్కుకీ, నోటికి కలిపి అడ్డంగా కట్టుకున్న ఫిల్టర్ గుడ్డతో, తెల్లటి బట్టలతో, గ్లవ్స్‌వున్న చేతులకి అంటిన రక్తంతో విచిత్రంగా వున్నాము మేము ఆ గదిలో.

"ఆపరేషన్ సక్సెస్."

మొదటిసారిగా నోరు విప్పాను.

నిర్జీవంగా తన గుండెకూడా కోల్పోయివున్న ఆ నిర్భాగ్యుడివంక చూసి బయటకి నడిచాను. గ్లవ్స్ విడచి, చేతులు కడుక్కుని, తెల్లఎప్రన్ విడిచాను.

కాఫీ కావాలి మళ్ళీ.

రెండుకప్పుల వేడికాఫీ త్రాగాను. ప్రాణం తేరుకున్నట్లయింది టెన్షన్ తగ్గింది కొద్దిగా.

ఈజీఛేర్‌లో పడుకుని కళ్ళు మూసుకున్న నాకు నా గుండెచేసే "లబ్-డబ్" శబ్దం వినపడుతోంది, ఎంత వేగంగా కొట్టుకుంటోంది?

"డాక్టర్ హీ ఈజ్ ఆల్‌రైట్" నర్సు వచ్చి రిపోర్టు చేసింది నాకు.

"గుడ్. హీ విల్ బి ఆల్‌రైట్. ఆక్సిజన్ జాగ్రత్తగా చూడండి

గంట దాటాక గ్లూకోజ్ ఇవ్వాలి ఇంకా ఏం చేయాలో జాగ్రత్తగా వివరించాను నర్స్‌కి.

"థాంక్యూ మష్టర్ కార్డియాలజిస్ట్. ది గ్రేట్" ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంతోషంగా అన్నాడు నాతో, నా చేయి పట్టుకుని ఊపుతూ

నవ్వాను బదులుగా.

"యు ఆర్ వండ్రఫుల్. వైద్యరంగంలో మరో అడుగుముందుకు వేసిన మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియటంలేదు" అన్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్"

హాస్పిటల్ సూపరింటెండెంట్ ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. తన హాస్పిటల్‌లో జరిగిన ఆపరేషన్ సక్సెస్ అవటం ఆయనకి చాలా సంతోషాన్నిచ్చింది.

ఆంజనేయులి డామేజ్ గుండెని తీసి మరో క్రొత్తగుండెని అమర్చిన నాకు అనేకమంది తమ తమ సంతోషాన్ని, అభినందనలను తెలియజేశారు.

కళ్ళు మూసుకున్నాను ఈజీ ఛైర్‌లోనే పడుకుని.

నామనస్సు ఎందుకో తేలికగావుంది నాకు. తృప్తిగా ఉంది. హాయిగా వుంది ఆనందంగా వుంది.

* * *

మరో వారందాకా ఎంతో జాగ్రత్తగా పరీక్షించాను ఆంజనేయులుని. అంతా సరిగానేవుంది. ఆంజనేయులుకి చేసిన ఆపరేషన్ చక్కగా అయింది.

నెల తర్వాత కట్లు విప్పాను.

ఆంజనేయులు డిశ్చార్జ్ అయ్యాడు నెలన్నరతర్వాత, పోలీస్ డాక్టర్‌కి అప్పగించాను అతన్ని. అతనికి చేయవలసిన చికిత్స గురించి చెప్పాను.

విడుదలవుతే ఆంజనేయులు ఎలా జీవించాలో చెప్పాను. పరిగెత్త

కూడదు. అయాసం కలిగేపనులు చేయకూడదు. బరువులు ఎత్తటం, గెంతటం, గుండెకి అలుపువచ్చేపనులు చేయుటం కూడదు.

నాకు తెలుసు అంజనేయులుకి అవన్నీ చెప్పి వుపయోగంలేదని. అయినా డాక్టర్‌గా నా విధి నిర్వర్తించాను! అంతే. అంజనేయులు డిశ్చార్జ్ అయ్యేలోపల అలాంటి ఆపరేషన్లే మరో రెండు చేసాను.

దురదృష్టవశాత్తు ఒకటి ఫెయిలయింది. ఫెయిలవడానికి కారణం నేను కాను. చేయవలసినదంతా సక్రమంగానే చేసినా ఎందుకో ఆపరేషన్ అయిన అరగంటలోనే చచ్చిపోయాడు పేషెంట్.

నాలుగయిదు పత్రికలు నన్ను ఫోటోలు తీసి, నాతో ఇంటర్వ్యూ చేసాయి, తమతమ పత్రికలలో ప్రచురించేందుకు. గుండె జబ్బుతో బాధ పడుతున్న ఓ ధనవంతుడు తన గుండెనొప్పిని భరించలేక నా చేత ఆపరేషన్ చేయించుకోడానికి నిర్ణయించుకున్నాడు. ఆరోగ్యవంతమైన గుండె అమర్చడానికి నాకు పదివేల రూపాయల ఫీజు!

అంజనేయులు కోర్టుకు వెళుతున్నాడు ఇప్పుడు. అతని నేరాలని విచారిస్తున్నారు కోర్టులో.

అతని నేరాలు రుజువయితే మొట్టమొదటి గుండె మార్పిడి రోగిని వురితీస్తారా?

ఈ విషయంమీద పత్రికలు తమతమ వ్యాఖ్యానాలు వ్రాస్తున్నాయి. ఇంతకష్టపడి బ్రతికించడం ఉరితీసి చంపడానికేనా?

ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకి ఒక మెమోరాండం సమర్పించింది, అంజనేయులుని ఉరితీయకూడదని. క్రొత్తగుండెతో ఎంతకాలం బ్రతుకుతాడు, బ్రతికితే ముందుముందు అతనికి ఏం అవుతుంది, మొదలయిన సంగతులు పరిశీలించడానికి 'సైంటిఫికల్'గా అంజనేయులు తోడ్పడుతాడని, కాబట్టి అతన్ని పోలీస్ హాస్పిటల్‌లోనే వుంచి, వైద్యుల తణిఖీకి ఉపయోగపడేలా ఏర్పాటు చేయాలని మెమోరాండంలో వ్రాసారు.

ఆ మెమోరాండంలో నేను కూడా సంతకం చేసాను. హైకోర్టు ఆంజనేయుల విషయంలో తీర్పు నిచ్చింది.

మరణశిక్ష.

ఆంజనేయులు తన నేరాలని నేరాలుగా అంగీకరించకపోయినా, పేదపీడిత ప్రజలకోసం చేసానని ఒప్పుకున్నాడు,పత్రికలకి ఆంజనేయులు చర్చనీయంగా తయారయాడు. అతన్ని వురితీస్తారా, లేదానని.

తాత్కాలికంగా మరణశిక్ష నమలుపరచకుండా పోలీస్ కస్టడీలో వుంచారు ఆంజనేయులుని.

నాకూ అమిత వుత్సాహంగా వుంది ఆంజనేయులుని ఉరితీస్తారా, లేదానని.

ఉరిశిక్ష విధించిన వారం తర్వాత పేపర్లో చదివాను ప్రెసిడెంట్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నిద్దరికి ఓ కమిటీగా ఏర్పరచి ఆంజనేయులి విషయం ఏంచేయాల్సిందీ నిర్ణయించమని కోరాడని.

వాళ్ళు నా దగ్గరకు కూడా వచ్చారు. అడిగినవాటన్నిటికీ సమాధానాలు చెప్పాను. రాసుకుని వెళ్ళిపోయారు.

మరో వారం తర్వాత మళ్ళీ పేపరులో చూసాను. ఆంజనేయులుకి రాష్ట్రపతి క్షమాపణ లభించింది. ఆంజనేయులు కోరికమీద రాజకీయ ఖైదీగా జీవింతాంత జైల్లోనే గడపాలి ఆంజనేయులు. శిక్ష తగ్గించారు.

అతను బ్రతికివుండటంవల్ల మానవాళికి మేలు జరిగే అవకాశం ఎక్కువ.

పత్రికలు కొన్ని ప్రభుత్వాన్ని పొగిడితే, కొన్ని తెగిడాయి.అనేక మంది అనేక విధాలుగా చెప్పుకున్నారు. ఆంజనేయులి ద్వారా నా ప్రాముఖ్యత, పేరు కూడా పెరిగాయనే చెప్పాలి.

"మీకు ఎంతో రుణపడివున్నాను సార్."అన్నాడు ఆంజనేయులు నేను ఆఖరిసారి కల్సినప్పుడు, ఆబద్ధం.

రెండు నెలలు దాటాక రోజులు లెక్కపెడుతున్నాడు నేను. పేపర్లో

నాక్కావల్సిన వార్తకోసం చూస్తున్నాను రోజూ. పదిరోజులు పైనే గడిచాయి అవిధంగా.

*    *    *

ఆంజనేయులు హత్యచేయబడ్డాడు!

రాత్రి పడుకున్నవాడు తెల్లారి లేవలేదు!!

ఆర్సెనిక్ విషంతో చంపారు!!!

పోలీస్ హాస్పిటల్ నుంచి జైలుకి బదిలీ చేయబడ్డ ఆంజనేయులు రెండురోజుల తర్వాత చచ్చిపడున్నాడు తన సెల్‌లో. ఆర్సెనిక్ విషంతో చంపారు.

ఎవరు విషంపెట్టి చంపిందీ తెలియలేదు. పోలీసులు తమకేమీ తెలియదని చెప్పారు. ఆరోజు ఆంజనేయులిని విజిటర్స్ ఎవరూ చూడలేదు. భోజనం చేసి పడుకున్నాడు రాత్రి.

పోస్ట్‌మార్టం అప్పుడు నన్ను పిలిచారు. నేనూ వెళ్ళాను. విషం వల్లే చచ్చాడని నిర్ధారణ అయింది. ఆహారంద్వారా విషం ఇవ్వబడలేదు. ఒంట్లోకి సూది ద్వారా ఎక్కించిన గుర్తులు కూడా ఏమీ లేవు. విషంఎలా ఎక్కిందో అంతు పట్టలేదు.

పత్రికలు పోలీస్‌లని ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోసాయి. పబ్లిక్‌గా శిక్ష అమలుజరిపే ధైర్యం చాలక, జైల్లో విషంపెట్టి చంపారని దూషించాయి ప్రభుత్వాన్ని.

మెడికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తన బలమైన సంతాపం, ప్రభుత్వ సంరక్షణలో ఇలా జరగడానికి తమకోపం వ్యక్తం చేసింది.

ప్రభుత్వం మళ్ళీ మరో కమిటీని ఏర్పరిచింది. ఎవరు ఆంజనేయులని హత్యచేసారో కనుక్కోవడానికి, పోలీసులమీద నమ్మకంలేక. ఆ కమిటీలో నన్నుకూడావుంచింది. ఓ సుప్రీంకోర్ట్ జడ్జ్, సి.ఐ.డిలతోపాటుగా.

ఎంత ప్రయత్నించినా ఏమీ తేలలేదు. ఎవరినీ అనుమానించలేదు. అందరినీ అనుమానించాము. మా రిపోర్ట్ ప్రభుత్వానికి అందజేసాము. సారాంశం ఏమీ తెలియలేదనే బహుశ ఆంజనేయులికి ఎవరో ఆ విషం

అందించగా, అది త్రాగి చచ్చిపోయివుండటం జరిగి ఉండవచ్చు.

మిస్టరీగా మిగిలిపోయింది ఆంజనేయులి హత్య ప్రపంచానికంతటికీ— ఒక్క నాకుతప్ప.

*　　　*　　　*

టైఫాయిడ్‌లాంటి జబ్బుకి గొట్టంలావున్న టేబ్లెట్ ఇస్తారు. అది వేసుకుంటే ఆ టేబ్లెట్ నెమ్మదిగా పనిచేస్తుంది పైపొర కరిగిపోయి.

అలాంటి ప్లాస్టిక్‌గొట్టం తయారుచేసి, దాంట్లో కొంచెం ఆర్సెనిక్ వుంచితే ఆ ప్లాస్టిక్ పొర కరిగేదాకా ఆ విషం ఏం చెయ్యదు. కరిగాక చంపుతుంది మనిషిని.

మనిషి రక్తం వెచ్చగా ఉంటుంది. అలాంటి ప్లాస్టిక్‌గొట్టం కరగగొట్టగల వెచ్చదనం వుంది రక్తంలో. సరిగా మూడు నెలల తర్వాత ఆ గొట్టం కరిగేలా ప్లాస్టిక్‌తో తయారుచేసి ఆపరేషన్‌లో ఆంజనేయులు గుండె దగ్గర అమర్చాను దాన్ని, రక్తాన్ని తాకేలా.

గుండెలోకి పంప్ అయే రక్తంద్వారా క్రమంగా కరుగుతూ వస్తుంది లోపలి విషాన్ని. ప్రవహించే రక్తానికి దగ్గరచేస్తూ. ప్రభుత్వం వురితీయకపోయినా ఆంజనేయులు తప్పక చావాలని ఈ ఏర్పాటు నేను చేశాను.

ఎందుకో వూహించలేరు ఎవరూ. నేను కావాలని ఆంజనేయులిని చంపానని చెప్పినా నమ్మరు ఎవరూ. ఒకవేళ నమ్మినా ఎవ్వరూ రుజువు పరచలేరు ఆ సంగతి.

శ్రీకాకుళంజిల్లాలో, పార్వతీపురం తాలూకాలోని ఓ పల్లెటూరులో వున్న మా ఇంట్లోని నాన్నని గునపంతో సరిగా గుండెల్లో గుచ్చి చంపకపోయినా చెల్లాయ్‌ని రేప్‌చేసి ఆ తర్వాత అదే గునపంతో గుండెల్లోగుచ్చి చంపకపోయినా మా ఆ స్తిదోచుకుని ఇల్లు తగలపెట్టకపోయినా నక్సలైట్ ఆంజనేయులు మరణించేవాడుకాడు. హత్య చేయబడేవాడు కాదు.

నా మొదటి పేషంట్ కాకపోతే, నా వైద్య నైపుణ్యాన్ని పరీక్షించుకోడానికి ఆంజనేయులు కాక అంతకుముందే మరొకరయివుంటే, ఆంజనేయులుగుండెను ఆపరేషన్ టేబిలుమీదేనిర్దయగాకోసేసివుండేవాడ్ని.
(అపరాధ పరిశోధన ఏప్రిల్ 1974)